సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



దివ్యాంగులను వీడని కష్టాలు
దివ్యాంగులపై కక్ష కట్టినట్టుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పింఛన్ వెరిఫికేషన్ పేరుతో వారికి నరకం చూపిస్తోంది. 8లో



మార్చి 8న లోక్ అదాలత్
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చేనెల 8న జాతీయ లోక్అదాలత్ నిర్వహించనున్నట్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ తెలిపారు. 8లో



కల్యాణం చూతము రారండి
సూర్యభగవానుడి కల్యాణ మహోత్సవానికి తణుకు సూర్యదేవాలయం ముస్తాబయ్యింది. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 8లో

ఇసుకపై అధనపు దోపిడీ

అడ్డగోలు వసూళ్లు
- అనుమతులు లేక జిల్లాలో మూతపడిన ఇసుక ర్యాంపులు
- తూర్పుగోదావరి జిల్లా ర్యాంపులే ఆధారం
- ఉచిత ఇసుక పేరిట అనధికార వసూళ్లు
- లారీకి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు బాదుడు
- జిల్లావాసులపై రోజుకు రూ.30 లక్షల వరకు భారం
- కూటమి నేతల జేబుల్లోకి సొమ్ములు

భీమవరం పట్టణానికి తూర్పుగోదావరి జిల్లాలోని తీపర్రు ర్యాంపు 54 కి.మీ దూరంలో ఉంది. అక్కడ ఐదు యూనిట్ల ఇసుకకు రూ.1,924 లోడింగ్, రూ.9,180 రవాణా చార్జీ కలిపి వినియోగదారుడికి సుమారు రూ.11,200లకు చేరాలి. అయితే లోడింగ్ పాయింట్ వద్ద రూ.5 వేల అదనపు వసూళ్లతో రూ.16,000 చెల్లించాల్సి వస్తోంది. ఇలా వినియోగదారుడికి రూ.5 వేల అదనపు భారం పడుతోంది. **జిల్లాలో ఏ ప్రాంతానికైనా ప్రభుత్వం చెబుతున్న ధర కన్నా రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అదనం**గా చెల్లించాల్సిన పరిస్థితి. ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని కూటమి నేతలు గొప్పలు పోతుండగా.. ర్యాంపుల వద్ద అదనపు వసూళ్లు ఎందుకు చేస్తున్నారు? ఆ మొత్తం ఎవరెవరి జేబుల్లోకి వెళుతున్నాయనేది ప్రశ్నార్థకంగా మిగిలింది.



సాక్షి, భీమవరం: జిల్లాలోని ఆరు ఓపెన్ రీచ్‌లు, ఐదు డిసిల్టేషన్ పాయింట్లు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిధిలోకి వెళ్లడంతో వీటిని మూసివేశారు. జిల్లావాసులు ఇసుక కోసం తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని తీపర్రు, పెండ్యాల, పందలపర్రు, జొన్నాడ, గోపాలపురం తదితర ర్యాంపులకు వెళ్లాల్సి వస్తోంది. ర్యాంపుల నిర్వహణ నిమిత్తం టెండర్ ఖరారు చేసిన ధర మేరకు ప్రభుత్వం ఆయా ర్యాంపుల వద్ద లోడింగ్ చార్జీలను నిర్ణయించింది. ఐదు యూనిట్ల లారీని నింపేందుకు 20 టన్నుల ఇసుక అవసరమవుతుంది. ఈ మేరకు ఐదు యూనిట్ల లారీకి తీపర్రు ర్యాంపులో అయితే లోడింగ్ నిమిత్తం రూ.1,920, పెండ్యాల ర్యాంపులో రూ.1,380, పందలపర్రులో రూ.2,080లు చెల్లించాలి. అలాగే రవాణా ఖర్చుల కింద 40 కి.మీ లోపు దూరానికి టన్నుకు రూ.9లు చొప్పున ఐదు యూనిట్ల లారీకి కి.మీ రూ.180లు, దూరం 40 కి.మీ దాటితే టన్నుకు రూ.8.50లు చొప్పున రూ.170లుగా నిర్ణయించింది. ఈ మేరకు లోడింగ్, రవాణా చార్జీలు చెల్లించాలిజ

అదనపు వసూళ్లు
తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ఏ ర్యాంపు వద్దకు వెళ్లినా లోడింగ్ చార్జీలతో పాటు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అదనంగా చెల్లిస్తేనే ఇసుక లోడింగ్ చేస్తున్నట్టు లారీ యజమానులు చెబుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, కూటమి పెద్దలకు ఈ అదనపు వసూళ్ల నుంచి వాటాలు వెళుతున్నట్టు తెలుస్తోంది. అదనపు చెల్లింపులు చేసిన వారికే లోడింగ్ చేస్తున్నారని వారంటున్నారు. అదనపు వసూళ్ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని, ర్యాంపు నిర్వాహకుల తీరుతో ప్రజలతో పాటు తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

రోజుకు రూ.30 లక్షల వరకు భారం
అదనపు వసూళ్ల రూపంలో పాలకులు, నాయకుల జేబుల్లోకి వెళుతున్న వాటాల మొత్తం భారాన్ని జిల్లా ప్రజలు భరించాల్సి వస్తోంది. ఆ రెండు జిల్లాల్లోని ర్యాంపుల నుంచి రోజుకు జిల్లాకు 500 నుంచి 600 ట్రిప్పుల వరకు ఇసుక రవాణా జరుగుతుందని అంచనా. ఈ మేరకు జిల్లా ప్రజలపై రోజుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు భారం పడుతోందని అంచనా.

గత ప్రభుత్వంలో పక్కాగా..
గత ప్రభుత్వంలో ఆన్‌లైన్ విధానం ద్వారా ఇసుక అమ్మకాలు చేయడంతో అదనపు వసూళ్లు, అక్రమాలకు ఆస్కారముండేది కాదు. ఇసుక అన్‌లోడ్ చేసుకున్నాక నిర్ణీత ధర చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉందని వినియోగదారులు అంటున్నారు. ఇసుక ఉచితమని, కేవలం లోడింగ్, రవాణా చార్జీలు చెల్లిస్తే సరిపోతుందని చెప్పి అడ్డగోలుగా దోచుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

ఏ ర్యాంపునకు వెళ్లినా అదనంగానే..



ఇసుక ఉచితమని లోడింగ్ చార్జీలు చెల్లిస్తే సరిపోతుందని ప్రభుత్వం చెబుతోంది. ఏ ర్యాంపు వద్దకు వెళ్లినా లోడింగ్ చార్జీలతో పాటు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దీనివలన **ప్రజలతో పాటు సరిగా** కిరాయిలు రాక జిల్లాలోని లారీ యజమానులు నష్టపోవాల్సి వస్తోంది.
– రావూరి రాజా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు

తీపర్రు ర్యాంపు నుంచి ఇసుక సరఫరా ఇలా..

నియోజకవర్గ కేంద్రం	దూరం కి.మీ	ఐదు యూనిట్ల అసలు ధర (రూ.లలో)	ప్రస్తుత ధర (రూ.లలో)
భీమవరం	54	11,104	16,000
నరసాపురం	44	9,404	14,500
పాలకొల్లు	35	8,224	13,000
ఉండి	58	11,784	17,000
ఆచంట	29	7,144	12,000
తణుకు	13	4,264	10,000
తాడేపల్లిగూడెం	34	8,044	13,000

పట్టభద్రుల పోరు షురూ

- తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు
- 10 వరకు నామినేషన్ల స్వీకరణ
- 440 పోలింగ్ కేంద్రాలు.. 3.15 లక్షల ఓటర్లు
- 27న పోలింగ్



సాక్షి ప్రతినిధి,ఏలూరు : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు షూరూ అయ్యింది. సోమవారం నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అధికారికంగా ప్రారంభించారు. కలెక్టరేట్‌లో నామినేషన్లను రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్వీకరిస్తుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలి రోజు స్వతంత్ర అభ్యర్థి ఒకరు నామినేషన్ దాఖలు చేశారు.

నోటిఫికేషన్ జారీ
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేశారు. ఈనెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13న ఉపసంహరణ నిర్వహించి 27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ నిర్వహించేలా షెడ్యూల్‌ను ప్రకటించారు. గత నెల 29న గెజిట్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతిసారి తూర్పుగోదావరి కలెక్టర్‌ను రిటర్నింగ్ అధికారిగా నియమిస్తుంటారు. ఈసారి ఏలూరు జిల్లా కలెక్టర్‌ను నియమించడంతో నామినేషన్ల స్వీకరణ మొదలు విజేత డిక్లరేషన్ వరకూ అన్నీ ఏలూరు కలెక్టరేట్ కేంద్రంగానే జరుగనున్నాయి.

సీఆర్ఆర్‌లో స్ట్రాంగ్‌రూమ్
ఉభయగోదావరి జిల్లాల్లోని నూతన ఆరు జిల్లాల్లో 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,83,734 మంది పురుషులు, 1,31,507 మంది మహిళలు, 20 మంది ట్రాన్స్‌జండర్ మొత్తం 3,15,261 మంది ఓటర్లు ఉన్నారు. ఏలూరు జిల్లాలో 62 పోలింగ్ కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 93 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఎన్నికలు పూర్తయ్యాక ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించి మార్చి 3న కౌంటింగ్ ప్రక్రియను ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో స్ట్రాంగ్‌రూమ్ వద్ద ప్రత్యేక బందోబస్తు, కౌంటింగ్ హాళ్లకు ఏర్పాట్లను అధికార యంత్రాంగం పరిశీలించారు. అలాగే ఎన్నికల కోడ్ అమలుకు ప్రతి జిల్లాలో 21 ప్రత్యేక వీడియో, 22 ఎంసీసీ బృందాలు నియమించారు. పలుశాఖల అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు.

ఒక నామినేషన్ దాఖలు



నామినేషన్ సమర్పిస్తున్న పేపకాయల రాజేంద్ర

ఏలూరు(మెట్రో) : పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర సోమవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి నామినేషన్ పత్రాలు స్వీకరించారు.

జిల్లాల వారీగా ఓటర్లు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్	మొత్తం ఓటర్లు
ఏలూరు	62	24,895	17,699	8	42,602
పశ్చిమగోదావరి	93	39,780	30,103	1	69,884
తూర్పుగోదావరి	82	36,714	26,725	2	63,441
అంబేడ్కర్ కోనసీమ	95	37,069	27,256	2	64,367
కాకినాడ	96	42,437	27,899	7	73,343
అల్లూరి సీతారామరాజు	12	2,839	1,825	0	4,664

ఎస్సై ఆత్మహత్య వ్యవహారంలో తణుకు ఎమ్మెల్యే పాత్ర?

- స్నేహితుడితో సంభాషణలో ఎమ్మెల్యే పేరు ప్రస్తావన
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్ : ఎస్సై ఏజీఎస్ మూర్తి ఆత్మహత్య వ్యవహారంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పాత్ర కూడా ఉందనడానికి స్నేహితుడితో ఎస్సై చేసిన సంభాషణ ఆడియోలో ఎమ్మెల్యే పేరు ప్రస్తావించడమే నిదర్శనమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సై మూర్తి మనోవేదన వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. గేదెల చోరీ, ఆపై ఎమ్మెల్యే రాధాకృష్ణ అనుచరుల సెటిల్‌మెంట్, తణుకు రూరల్ సర్కిల్ కార్యాలయంలో డబ్బు కట్టలతో చేసిన లావాదేవీల్లో ఎక్కడా కూడా ఎస్సై మూర్తి లేకపోయినా ఆయన్ను అన్యాయంగా పొట్టనబెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో తణుకు ఎమ్మెల్యే, అప్పటి సీఐ నాగేశ్వరరావు, ప్రస్తుత సీఐ బి.కృష్ణకుమార్‌తో పాటు ఉన్నతాధికారి పాత్ర కూడా కీలకంగా ఉందని ఆరోపించారు. ఎస్సై మూర్తి వీఆర్ నుంచి పోస్టింగ్ కోసం స్నేహితుడితో మాట్లాడిన సంభాషణలో ఎమ్మెల్యే పేరు ప్రస్తావించడం ద్వారా ఆయన పాత్ర కూడా ఉందని నిరూపితమవుతోందని స్పష్టం చేశారు. వీఆర్, పోస్టింగ్‌ల విషయంలో ఎస్సై నుంచి అన్యాయంగా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి సెటిల్‌మెంట్‌లకు అధిక ప్రాధాన్యత ఏర్పడిందని, అధికారులు స్వేచ్ఛగా ఉద్యోగాలు చేసుకోలేక, ఎమ్మెల్యే ఆదేశాలతో విధులు నిర్వర్తించలేక అవస్థలు పడుతున్నారని కారుమూరి విమర్శించారు.

రూరల్ స్టేషన్‌లో పాతుకుపోయిన సిబ్బంది
తణుకు రూరల్ సర్కిల్ స్టేషన్‌లో పాతుకుపోయిన ఏఎస్సైలు రాజకీయ పలుకుబడితో డబ్బు సెటిల్‌మెంట్లు అధికంగా చేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి అన్నారు. ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటూ సీఐల కన్నా ఎక్కువగా అధికారం చెలామణి చేస్తూ ఎస్సైలను సైతం ఇబ్బందుల్లోకి నెడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా ఏఎస్సైలు సంగీత్, అంజిబాబు ఇద్దరూ కూడా నియోజకవర్గంలోనే పోస్టింగ్ వేయించుకుంటూ ఇక్కడే తిష్ట వేశారన్నారు. ఎస్సై మూర్తి ఆత్మహత్య వ్యవహారంపై తక్షణమే సిట్ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ తరఫున డిమాండ్ చేస్తున్నట్టు కారుమూరి చెప్పారు. పార్టీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పేరు ఎందుకు ప్రస్తావించారు?

ఎస్సై ఆత్మహత్య ఉదంతంపై చర్చనీయాంశంగా మారిన ఆడియో

సాక్షి, భీమవరం/ తణుకు అర్బన్: ఎస్సై మూర్తి మాట్లాడినట్టుగా ఉన్న ఆడియోలో ఎమ్మెల్యే పేరు ఎందుకు ప్రస్తావించారు? ఎమ్మెల్యే ఏం చేయమన్నారని పై అధికారులు ఆయనపై ఒత్తిడి తెచ్చి ఉంటారు ? ఓ పోలీస్ అధికారి మానసిక క్షోభతో ఆత్మహత్య చేసుకునేంత ఒత్తిడికి గురికావడం వెనుక కారణాలు ఏమై ఉండవచ్చునన్న ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం
వీఆర్‌లో ఉన్న ఎస్సై ఏజీఎస్ మూర్తి ఆత్మహత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. సామాన్యుల నుంచి జిల్లాలోని పోలీస్ ఉన్నతాధికార వర్గాల్లోనూ ఈ విషయంపైనే చర్చ జరుగుతోంది. తణుకులో పశువధ కర్మాగారం ప్రారంభమయ్యాక తణుకు, పరిసర ప్రాంతాల్లో గేదెల దొంగతనాలు ఎక్కువయ్యాయి. తణుకు రూరల్ ఎస్సైగా మూర్తి పనిచేసిన సమయంలో ఈ చోరీలను అరికట్టడంలో సమర్థవంతంగా పనిచేసేవారని స్థానికులు అంటున్నారు. గేదెల చోరీకి సంబంధించిన కేసు విషయమై ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు మూర్తిని వీఆర్‌లోకి పంపారు. ఆ వ్యవహారంలో తన ప్రమేయం లేకపోయినా తనను ఇరికించారని మూర్తి తీవ్ర మానసిక క్షోభకు గురయ్యేవారని తెలుస్తోంది. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఎస్సై మూర్తి తన స్నేహితునితో ఫోన్‌లో మాట్లాడినట్టుగా ఉన్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

హాట్‌టాపిక్‌గా..
ఆ ఆడియోలో తనను మోసం చేసిన వారందరూ హ్యాపీగా ఉన్నారని మూర్తి కుమిలిపోయారు. తనపై అధికారులు కృష్ణకుమార్, నాగేశ్వరరావు చేసిన పనికి ఈరోజు ఇలా అయిపోయానని బాధపడ్డారు. నన్ను ఇబ్బంది పెట్టకండి సార్ అని చెప్పాని.. లేదు లేదు ఎమ్మెల్యే గారు చెప్పారు కదా అదీఇదీ అంటూ తన జీవితాన్ని పెంట చేశారంటూ ఆడియోలో స్నేహితుని వద్ద మూర్తి చెప్పిన మాటలు అటు పొలిటికల్, ఇటు అధికార వర్గాల్లోను హాట్‌టాపిక్‌గా మారాయి. అసలు ఎమ్మెల్యే ప్రస్తావన ఎందుకు వచ్చిందనే చర్చ జోరుగా సాగుతోంది. ఆత్మహత్య ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతున్నట్టుగా కనిపించడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసుకు సంబంధించిన సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఎస్సై మూర్తి ఆడియో వైరల్ కావడంతో అందులో ప్రస్తావించిన సీఐలు కృష్ణకుమార్, నాగేశ్వరరావుతో పాటు మరో ఉన్నతాధికారిపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. సోమవారం వారిని ఎస్పీ కార్యాలయానికి రావాల్సిందిగా పిలుపువచ్చినట్టు సమాచారం.



వీరంపాలెంలో అక్షరాభ్యాసాలు



ఏలూరులో పూజలు చేస్తున్న విద్యార్థులు



వీరంపాలెంలో మేధాసరస్వతీ దేవి

వేదమాత.. విద్యాప్రదాత

సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామరూపిణి.. స్మరణలు మార్మోగాయి. వసంతి పంచమి సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో చిన్నారులతో అక్షరాభ్యాసాలు, విద్యార్థులతో సామూహిక పూజలు చేయించారు. తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలోని బాలాత్రిపురసుందరి విద్యా, ఆధ్యాత్మిక పీఠంలోని మేధా సరస్వతి సన్నిధిలో సుమారు వెయ్యి మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి, పీఠం ప్రతినిధి శశి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏలూరులోని పాత బస్టాండు సెంటర్‌లోని పాండురంగ స్వామి దేవస్థానంలో సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.
– తాడేపల్లిగూడెం రూరల్/ఏలూరు (ఆర్ఆర్‌పేట)

స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో స్టాక్ పాయింట్లకు ఇసుకను తరలించి అక్కడి నుంచి ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా విక్రయించేలా చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తీపర్రు-2 రీచ్ నుంచి స్టాక్ పాయింట్లకు ఇసుకను చేరవేస్తామన్నారు. స్టాక్ పాయింట్ల వారీగా ఆచంటలో 200 టన్నులు అందుబాటులో ఉందని టన్ను రూ.295, పాలకొల్లులో 220 టన్నులు అందుబాటులో ఉండగా టన్ను రూ.320, తాడేపల్లిగూడెంలో 100 టన్నులు ఉండగా టన్ను రూ.300, తణుకులో 20 టన్నులు ఉండగా టన్ను రూ.215, నరసాపురంలో 160 టన్నులు ఉండగా టన్ను రూ.370, ఉండిలో 200 టన్నులు అందుబాటులో ఉండగా టన్ను రూ.440కు పొందవచ్చన్నారు. డిజిటల్ పేమెంట్ ద్వారా ఇసుక సరఫరా చేస్తారన్నారు.

న్యూస్‌రీల్

చిన్నారులపై దాడులను ఉపేక్షించం



ఆస్పత్రిలో చిన్నారులను పరామర్శిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

జంగారెడ్డిగూడెం: బాలలపై జరిగే దాడులు, హింసలను బాలల హక్కుల కమిషన్ ఉపేక్షించదని, బాధ్యులపై జువైనల్ జస్టిస్ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ చెప్పారు. జంగారెడ్డిగూడెంలో చిన్నారులపై పాశవిక దాడికి సంబంధించి సోమవారం ఏరియా ఆస్పత్రిలో బాధిత చిన్నారులు ఉదయ్‌రాహుల్, రేణుకలను ఆయన పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చిన్నారులపై పాశవిక దాడి తనను బాధించిందన్నారు. ఘటనపై వెంటనే చర్యలకు అధికారులను ఆదేశించామన్నారు. సంరక్షకులు 18 ఏళ్లలోపు చిన్నారుల హక్కులను గౌరవిస్తూ వారు స్వేచ్ఛగా ఎదిగేలా సహకరించాలన్నారు.

బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పెనుమంట్ర: బాలికలు విద్యలో రాణించడంతో పాటు ఆత్మవిశ్వాసంతో సాధికారతకు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం మార్టేరులోని వేణుగోపాలస్వామి హైస్కూల్‌లో ఆడపిల్లల ఆత్మరక్షణ కార్యక్రమాన్ని జిల్లాలో తొలిసారిగా ఆమె ప్రారంభించారు. రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రసిక్షన్ శిక్షణ కార్యక్రమాలు జిల్లాలోని ప్రతి పాఠశాలలో రోజుకు గంట చొప్పున మార్చి 15 వరకు కొనసాగేలా చర్యలు తీసుకున్నామన్నారు. రూపేష్ వెల్ఫేర్ సొసైటీ నుంచి 50 మంది కరాటే టీచర్లను కేటాయించామని, మాస్టరింగు, సెల్ఫ్ డిఫెన్స్, జూడో, తైక్వాండో కరాటేలో శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలోని 80 ప్రాథమికోన్నత పాఠశాలలు, 230 హైస్కూళ్లలో సుమారు 25 వేల మంది బాలికలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. డీఈఓ ఈ.నారాయణ, ఎస్ఎస్ఏ ఏపీసీ శ్యామ్‌సుందర్, తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీఓ పి.శామ్యూల్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు
భీమవరం: ఇంటర్మీడియెట్ క్వాలీఫయింగ్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయని డీఐఈఓ నాగేశ్వరరావు తెలిపా. సోమవారం జిల్లావ్యాప్తంగా 123 కేంద్రాల్లో పరీక్షలకు జనరల్ విద్యార్థులు 17,718 మందికి 17,580 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,072 మందికి 1,982 మంది హాజరయ్యారని చెప్పారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలి
భీమవరం: పాఠశాలలు పునర్వ్యవస్థీకరణలో భాగంగా విద్యార్థుల డ్రాప్‌అవుట్ లేకుండా చూడాలని, ముఖ్యంగా తీరప్రాంత ప్లిలలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పాఠశాలలు పునర్వ్యవస్థీకరణపై డీఈఓ, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో ఆమె సమీక్షించారు. ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పునర్వ్యవస్థీకరణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమన్వయంతో పనిచేసి సత్ఫలితాలు రాబట్టాలన్నారు. డీఈఓ ఈ.నారాయణ, ఎంఈఓలు పి.పుష్పరాజ్యం, జి.జాన్‌ప్రభాకర్, జి.వీరాస్వామి, ఎన్‌వీఎస్‌జీ శర్మ, డి సుభాకరరావు, కె.వెంకట రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

సముద్రపు కోత నిరోధానికి చర్యలు
భీమవరం(ప్రకాశం చౌక్): పీఎం లంక వద్ద సముద్రం కోత నిరోధానికి డిలైట్ కంపెనీ ప్రాజెక్టు పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ నాగరాణి కోరారు. సోమవారం భీమవరం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యూఢిల్లీలోని డిలైట్ ప్రతినిధులతో వర్చువల్‌గా ఆమె సమావేశమై పీఎం లంక ప్రాజెక్టుపై సమీక్షించారు. డిలైట్ ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ అలైన్‌మెంట్ విషయమై నరసాపురం ఆర్డీఓ రైతులతో మాట్లాడి ఒప్పించారని, గతంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను ఆమోదిస్తున్నామని, ఈ మేరకు సాధ్యమైనంత త్వర గా ప్రాజెక్ట్ పనులను ప్రారంభించి పూర్తిచేయా లని కోరారు. ఆర్డీఓ ప్రతిపాదనలను డిలైట్ కంపెనీ ప్రతినిధులు అంగీకరిస్తూ, ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నరసాపురం ఆర్డీఓ దాసిరాజు, నరసాపురం ఇరిగేషన్ డీఈ సీహెచ్ వీవీఎస్ సత్యనారాయణ, తహసీల్దార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో నరసాపురం మాజీ ఎమ్మెల్యే



శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సోమవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ట్రాక్టర్ ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ మృతి

మరొకరికి గాయాలు



క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

కుక్కునూరు: మోటార్‌సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. కుక్కునూరు మండలంలోని నెమలిపేట గ్రామ సమీపంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలివి. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన అయితంరాజుల శ్రీనివాస్, పూజారి దుర్గాప్రసాద్ మోటార్ సైకిల్‌పై ఓ శుభకార్యానికి వేలేరుపాడు వెళుతుండగా నెమలిపేట సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. క్షతగాత్రులను 108లో భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే శ్రీనివాస్ మృతి చెందాడు. దుర్గాప్రసాద్ కాలికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. శ్రీనివాస్ మృతదేహాన్ని పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు వివరించారు.

1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



మిట్టగూడెంలో కాపుసారాను కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

నూజివీడు: జిల్లాలోని నూజివీడు, చింతలపూడి మండలాల్లో ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 70 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు జిల్లా ఏఈఎస్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నూజివీడు మండలం మిట్టగూడెంలో నిర్వహించిన దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేటకు చెందిన భూక్యా కసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 45 లీటర్ల కాపుసారాను, టీవీఎస్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనికి బెల్లం సరఫరా చేస్తున్న విస్సన్నపేటకు చెందిన జూలూరి రాంబాబు అనే వ్యాపారిపైన కేసు నమోదు చేశామన్నారు. అలాగే చింతలపూడి మండలం ప్రగడవరంలో నిర్వహించిన దాడుల్లో కాగిత రాంబాబును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 25 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బీ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను వీడని కష్టాలు

- పింఛన్ వెరిఫికేషన్ పేరిట కూటమి ప్రభుత్వం వేధింపులు
- పింఛన్లు తొలగిస్తారేమోనని లబ్ధిదారుల ఆందోళన



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రికి పింఛన్ వెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగులు



నడవలేని స్థితిలో పింఛన్ వెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగులు

భీమవరం (ప్రకాశం చౌక్): దివ్యాంగులపై కక్ష కట్టినట్లుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కదలలేని, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులను పింఛన్ వెరిఫికేషన్ పేరిట ప్రభుత్వ ఆస్పత్రులకు రప్పించి ప్రత్యక్ష నరకం చూపిస్తోంది. సోమవారం నుంచి భీమవరం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో దివ్యాంగుల పింఛన్ వెరిఫికేషన్ ప్రారంభించింది. దీంతో భీమవరం పరిసర ప్రాంతాల నుంచి దివ్యాంగులు కుటుంబ సభ్యుల, బంధువుల సహాయంతో ఆటోల్లో ఇబ్బందులు పడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. తాడేపల్లిగూడెం నుంచి వచ్చిన ఎముకల వైద్యులు దివ్యాంగుల అంగవైకల్యం పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు 50 మంది చొప్పున వెరిఫికేషన్ చేస్తున్నారు. జిల్లాలో 27,590 మందికి వరకు దివ్యాంగులు పెన్షన్ లబ్ధిదారులు ఉండగా వారిలో ఇప్పటివరకు 1200 మంది దివ్యాంగులను సదరమ్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగింది. జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రి తణుకులో పింఛన్లు వెరిఫికేషన్లు కొనసాగుతున్నాయి.

ఆందోళనలో దివ్యాంగులు

వెరిఫికేషన్ పేరుతో పింఛన్లు తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని దివ్యాంగులు ఆందోళనకు గురవుతున్నారు. కదలలేని, నడవలేని స్థితిలో ఉన్న తమను వెరిఫికేషన్ పేరుతో ఆస్పత్రులకు రప్పించడం న్యాయం కాదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావాలంటే గ్రామంలోకి వైద్యులు వచ్చి పరీక్షలు, వెరిఫికేషన్ చేసుకోవాలిగాని ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తున్నారు.

కొత్త పింఛన్ల ఊసే లేదు

పింఛన్ వెరిఫికేషన్ పేరిట సదరం క్యాంపులు మూడు నెలల పాటు నిలుపుదల చేయడంతో అర్హత కలిగిన దివ్యాంగులు కొత్త పింఛన్ల మంజూరు జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు. జగన్ ప్రభుత్వంలో ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేవారని, కూటమి ప్రభుత్వం ఉన్నవి తొలగించే కుట్రలకు తెరతీస్తోందని మండిపడుతున్నారు.

ఇంటి వద్దే పింఛన్ వెరిఫికేషన్ చేయాలి



నేను నడవలేని స్థితిలో ఉన్నాను. పదేళ్లుగా దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నా. అయినా ఈ వెరిఫికేషన్ ఏంటో అర్థం కావడం లేదు. తప్పనిసరై తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆస్పత్రికి వచ్చాం. నడవలేని వారికి ఇంటి వద్దే వెరిఫికేషన్ జరిగేలా చూడాలి. – వై.మునలయ్య యనమదుర్రు

మళ్లీ పింఛన్ వెరిఫికేషన్ ఎందుకు..




నాకు గత 15 ఏళ్లగా పింఛన్ వస్తోంది. మళ్లీ ఇప్పుడు పింఛన్ వెరిఫికేషన్ అని చెబుతున్నారు. వెరిఫికేషన్‌కు ఒక్కడినే రాలేక మా చిన్నాన్న సాయంతో వచ్చాను. ఆయన కూలి పని మానుకొని నన్ను తీసుకురావాల్సి వచ్చింది.

– పి.జకరయ్య, తుమ్మగుప్ప

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్



డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం మార్చి 8వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనమునందు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు, మున్సిపల్ ఆస్తి, నీటి పన్నుల కేసులను రాజీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే ప్రతి శనివారం అన్ని కోర్టుల్లో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత డిసెంబర్ 14వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో వివిధ కేసులకు సంబంధించి 5,616 కేసులను పరిష్కరించుకొని కక్షిదారులు విముక్తి పొందారని, 2025 మార్చి 8వ తేదీన జాతీయ లోక్‌అదాలత్‌కు 3,746 కేసులను పరిష్కారానికి మధ్యవర్తిత్వం ద్వారా గుర్తించినట్లు చెప్పారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో గల 11 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలతో కూడా కేసులను పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కక్షిదారులు జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రత్నప్రసాద్ కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి



ఘటనా స్థలంలో నాగేశ్వరరావు మృతదేహం

భీమడోలు: జాతీయ రహదారి పూళ్ల సమీపాన సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన జాగారపు నాగేశ్వరరావు (69) భీమడోలు జంక్షన్‌లోని రాజా హోటల్‌లోనే కూలీగా పనిచేస్తూ అక్కడే జీవనాన్ని సాగిస్తున్నాడు. కైకరంలోని తన కుమార్తె వద్దకు తరచుగా వెళ్లి వస్తుంటాడు. ఈక్రమంలో సోమవారం తెల్లవారుజామున కైకరంలోని కుమార్తె ఇంటి శంకుస్థాపన కార్యక్రమానికి భీమడోలు జంక్షన్ నుంచి తన సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో పూళ్ల సమీపంలోని పి.కన్నాపురం వెళ్లే రైల్వే గేటు ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై అతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమయంలో దట్టమైన మంచు కురుస్తుండడంతో వాహనాలు రాకపోకలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. కుమార్తె నక్కా కనకలక్ష్మీ ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యభగవానుడి కల్యాణం చూతమురారండి

- నేడు రథసప్తమి
- ప్రత్యక్ష నారాయణుడి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- పలు జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు



తణుకులో శ్రీసూర్యదేవాలయం



సూర్యనారాయణస్వామి



సూర్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన చలువ పందిర్లు

తణుకు అర్బన్: శ్రీ సూర్యభగవానుడి కల్యాణ మహోత్సవానికి తణుకు శ్రీసూర్యదేవాలయం ముస్తాబయ్యింది. ఈనెల 4వ తేదీన రథసప్తమిని పురస్కరించుకుని సూర్య దేవాలయంలో ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేతుడైన శ్రీ సూర్యభగవానుడికి కల్యాణం నిర్వహించేందుకు దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

రాష్ట్రంలో రెండోది...

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి తరువాత రాష్ట్రంలో రెండో సూర్యదేవాలయంగా తణుకు సూర్యదేవాలయం పేరుగాంచింది. ముఖ్యంగా ప్రతి ఏడాది రథసప్తమి సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి 60 వేలకు పైగా భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది కూడా అదే సంఖ్యను దృష్టిలో పెట్టుకుని దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ పెద్దల పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం, దివ్య దర్శనం కార్యక్రమాలకు అంతా సిద్ధం చేశారు. భక్తులంతా స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించే విధంగా సూర్యాలయం వీధి రోడ్డు పొడవునా చలువ పందిర్లు వేసి బారికేడ్లు ఏర్పాటుచేశారు.

అరుదైన విగ్రహం

తణుకు సూర్యదేవాలయంలోని స్వామి విగ్రహం సప్త అశ్వాలతో అనూరుడను సారథితో ద్వారపాలకుల పహారాతో ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేతుడైన సూర్యభగవానుడి విగ్రహం అరుదైనదిగా చరిత్రలో నిలిచింది. 1942వ సంవత్సరంలో తణుకుకు చెందిన జోశ్యుల శ్రీరామమూర్తి స్థాపించిన తణుకు ఆలయంలోని ఈ సూర్య విగ్రహం స్కాంద, పద్మ పురాణాల్లో ప్రస్తుతించబడిన విధంగా చూపరులకు నేత్రానందం కలిగిస్తోంది. 2001వ సంవత్సరంలో తణుకుకు చెందిన చిట్టూరి పరిపూర్ణ బ్రహ్మానంద చౌదరి, భక్తుల సహకారంతో ఆలయాన్ని పునఃప్రతిష్ఠ చేశారు.

కల్యాణ ఘట్టం

ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేతుడైన శ్రీ సూర్య భగవానుడికి శ్రీ వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం మంగళవారం ఉదయం 11.30 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు పండితులు ముహూర్తం నిర్ణయించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులకు స్వామివారి దివ్య దర్శనం, మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజాధికాలు నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి స్వామివారి ఆలయ ప్రాంతంలో అన్నప్రసాద వితరణ దాతల సహకారంతో ఏర్పాటుచేశారు.

అన్ని ఏర్పాట్లూ చేశాం



రథసప్తమికి సమారుగా 60 వేల మంది భక్తులు సూర్యభగవానుడిని దర్శనార్థం వస్తారని అంచనా. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశాం. సూర్యాలయం వీధి పొడవునా చలువ పందిర్లు, భక్తులు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకునేలా బారికేడ్లు సిద్ధం చేశాం. స్వామివారి దివ్యదర్శనం, కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేస్తాం. భక్తులందరికీ అన్నప్రసాద వితరణ అందుబాటులో ఉంటుంది.

– ముత్యాల సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి

చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత

రాష్ట్ర అటవీశాఖ ప్రధాన దళాధిపతి చిరంజీవి చౌదరి



విద్యార్థుల పోటీలను పరిశీలిస్తున్న రాష్ట్ర అటవీశాఖ ప్రధాన దళాధిపతి చిరంజీవి చౌదరి

కైకలూరు: చిత్తడి నేలల పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి రక్షించాలని రాష్ట్ర అటవీశాఖ ప్రధాన దళాధిపతి చిరంజీవి చౌదరి అన్నారు. ఏలూరు డివిజన్ అటవీశాఖ, వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఆటపాక పక్షుల కేంద్రంలో భవిష్యత్తు కోసం చిత్తడి నేలల రక్షణ అనే నినాదంతో చిత్తడి నేలల దినోత్సవం, బార్డ్ ఫెస్టివల్ సోమవారం నిర్వహించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 25 హైస్కూళ్లు, 10 కాలేజీల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ ప్రజలు రాజ్యాంగం ప్రసాదించిన విధులతో పాటు బాధ్యతలు గుర్తుంచుకోవాలన్నారు. పర్యావరణం పాడైతే ఎంత డబ్బు ఉన్న ఆరోగ్యం ఉండదన్నారు. రాజమండ్రి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ ఇటీవల అధ్యయనాల్లో 60 శాతం జీవవైవిధ్యం కొల్లేరులో తగ్గిందని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. కొల్లేరు ఆక్రమణలు సమస్యగా మారాయన్నారు. రాష్ట్ర వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ ఏకే.నాయక్, . డబ్ల్యూడబ్ల్యూఎఫ్ స్టేట్ డైరెక్టర్ ఫరిదా టంపల్ మాట్లాడుతూ కొల్లేరు చిత్తడి నేలలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా డీఎఫ్‌వో బి.విజయ కొల్లేరులో అటవీశాఖ తీసుకున్న చర్యలను వివరించారు. మాజీ గ్లోబల్ పాలసీ ఎడ్వైజర్ గుజ్జా బిక్షం తెలుగు రాష్ట్రాల్లో రామ్‌సర్ గుర్తించిన ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు అని, ఆక్రమణలు, కాలుష్యం కొల్లేరు ఉనికిని దెబ్బతీస్తున్నాయన్నారు. ఐబీసీఎస్, ఈ–బార్డ్ రెండు రాష్ట్రాల కో–ఆర్డినేటర్ శ్రీరామ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పక్షుల విశేషాలను వివరించారు. కొల్లేరు పక్షుల పోస్టర్‌ను అందరూ ఆవిష్కరించారు. అనంతరం ఏకో–సిస్టంపై క్విజ్, మట్టితో బొమ్మలు తయారు చేయడం, బొమ్మలను గుర్తించడం వంటి పోటీల్లో విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా టెరిటోరియల్ డీఎఫ్‌వో శ్రీసుభం, కాకినాడ టెరిటోరియల్ డీఎఫ్‌వో రవింద్రనాథరెడ్డి, ట్రెనీ డీఎఫ్‌వో నీరబ్ హన్స్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ షేక్, కోరంకి, ఏలూరు రేంజర్లు వరప్రసాద్, రామలింగాచార్యులు, అటవీశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్..

ఆటపాక పక్షుల కేంద్రం వద్ద అటవీశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ప్రధానంగా కోరింగ అభయారణ్యం ఏర్పాటు చేసిన మొసలి, పక్షులు, తాబేళ్లు, ఫ్లేమింగో, జింకలతో పాటు జీవకళ ఉట్టిపడే చేపలు, వలలతో దంపతుల మైనపు బొమ్మలు ఆకట్టుకున్నాయి. ఈస్టరన్ గేట్ వైల్డ్‌లైఫ్ సొసైటీ (ఈజీడబ్ల్యూఎస్) వివిధ రకాల పాముల గురించి కోఆర్డినేటర్ మూర్తి వివరించారు. కోస్టల్ కమ్యూనిటీస్ సంస్థ చేపల, రొయ్యల సాగు విధానాలు తెలిపారు.

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్ట్

రూ.9.80 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



జంగారెడ్డిగూడెంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: పట్టణంలో పలు చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి, రూ.9.80 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఒక ఇంట్లో గత ఏడాది ఆగస్టులో చోరీ జరిగినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పట్టణానికి చెందిన కంభపు వెంకటరమణ, వేముల శ్రీకాంత్‌లను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 35 గ్రాముల బంగారు వస్తువులు రికవరీ చేసినట్లు చెప్పారు. అలాగే పట్టణంలోని మారుతీ నగర్‌లో ఓ ఇంట్లో ఈ ఏడాది జనవరిలో చోరీ జరిగినట్లు తెలిపారు. దీనికి సంబంధించి తిరువీధుల మహేష్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఇతని వద్ద నుంచి 57 గ్రాముల బంగారు వస్తువులు, 46 గ్రాముల వెండి వస్తువులు రికవరీ చేసినట్లు చెప్పారు. వీటితో పాటు తిరువీధుల మహేష్ తాడేపల్లిగూడెం పట్టణంలో చోరీకి పాల్పడ్డాడని, దీనికి సంబంధించి రెండు కేసుల్లో 4 గ్రాముల బంగారు వస్తువులు, ఒక స్కూటీ కూడా రికవరీ చేసినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించడానికి సహకరించిన ఏఎస్సైలు ఎస్వీ సంపత్‌కుమార్, ఎన్.రాజేంద్రప్రసాద్, కానిస్టేబుళ్లు ఎస్.రమేష్, రాజశేఖర్‌లను డీఎస్పీ రవిచంద్ర అభినందించారు. సమావేశంలో సీఐ వి.కృష్ణబాబు, ఎస్సై షేక్ జబీర్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై మోటారు సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా అన్నవరం ప్రాంతానికి చెందిన కే సుబ్బారావు మంగళగిరి హైకోర్టులో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఆదివారం తెల్లవారుజామున అన్నవరం నుంచీ మోటార్‌సైకిల్‌పై మంగళగిరికి బయలుదేరారు. మార్గమధ్యలో ఏలూరు జాతీయ రహదారి చొదిమెళ్ళ ప్రాంతంలో మోటారుసైకిల్ ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని 108 అంబులెన్స్‌లో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన ఏలూరు జీజీహెచ్ వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించాలని సూచించగా.. అతని బంధువులు ఏలూరు నగరంలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం.. నిందితుడిపై కేసు నమోదు

భీమడోలు: స్థానిక దిగులుపాటిదిబ్బలోని జగనన్న కాలనీకి చెందిన వనం వెంకటరత్నంపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. దిగులుపాటిదిబ్బకు చెందిన వనం వెంకటరత్నం ప్రతి రోజు సాయంత్రం అతిగా మద్యం సేవించి వచ్చి కాలనీ వాసులందరిని ఇష్టానుసారం దూషిస్తుండేవాడు. అదే కాలనీకి చెందిన పితాని వెంకట నరసయ్య అది తప్పని మందలించడంతో వెంకటరత్నం అతనిపై కక్ష పెంచుకున్నాడు. ఈనెల 1వ తేదీన సాయంత్రం వెంకట నరసయ్య కుటుంబ సభ్యులను వెంకటరత్నం దూషించడం మొదలుపెట్టాడు. దీనిపై వెంకట నరసయ్య మందలించగా ఆగ్రహించిన వెంకటరత్నం తన వద్ద గల ఇనుపరాడ్‌తో అతడిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. తలపై, చేతులపై తీవ్రంగా గాయపర్చాడు. గాయాలపాలైన వెంకట నరసయ్యను కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన వాంగ్మూలం ఆధారంగా వనం వెంకటరత్నంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఉరి వేసుకుని ఓ వ్యక్తి తన ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ వైవీ రమణ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు పుష్పలీలానగర్ ప్రాంతానికి చెందిన సాయిదుర్గాప్రసాద్ తాపీపనులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం ఇంద్రాణి అనే మహిళతో వివాహం కాగా వీరికి ఐదేళ్ల పాప ఉంది. సోమవారం సాయిదుర్గాప్రసాద్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దుర్గాప్రసాద్ స్నేహితుడు శ్రీనివాస్ అనే వ్యక్తితో ఇంద్రాణి వివాహేతర సంబంధం కొనసాగిస్తూ మానసికంగా వేధించిందని, అందుకే తన కుమారుడు దుర్గాప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు టూటౌన్ సీఐ రమణ, ఎస్సై నాగకళ్యాణి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టి..

ఉంగుటూరు: ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టి ఓ మోటార్‌సైక్లిస్టు మృతి చెందాడు. ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీ పరిధిలోని హార్టికల్చర్ యూనవర్సిటీ వద్ద సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం చింతాయిగూడెంకు చెందిన మన్నే నాగరాజు (35) మోటార్‌సైకిల్‌పై తన అత్తవారి ఊరు తాళ్లపూడి వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా నల్లజర్ల – తాడేపల్లిగూడెం రోడ్డులో హార్టికల్చర్ యూనివర్సిటీ వద్ద ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగరాజు మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు శ్రీవారి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు

ద్వారకాతిరుమల: రథసప్తమి వేడుకలకు శ్రీవారి క్షేత్రం ముస్తాబైంది. మంగళవారం నిర్వహించనున్న స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవలకు వినియోగించే సూర్య, చంద్ర ప్రభ వాహనాలను ఆలయ సిబ్బంది సోమవారం ముస్తాబు చేశారు. ఈమేరకు వాహన శాల నుంచి సూర్య, చంద్ర ప్రభ వాహనాలను తీసుకొచ్చి శుభ్రం చేశారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు సూర్య ప్రభ వాహనంపై, రాత్రి 7 గంటల నుంచి చంద్ర ప్రభ వాహనంపై తిరువీధి సేవలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

దోమలు బాబోయ్.. దోమలు

- చీకట్లో ఆరుబయట ఉంటే తేనెపట్టులా పట్టేస్తున్న వైనం
- కుట్టికుట్టి చంపేస్తున్నాయంటున్న ప్రజానీకం

తణుకు అర్బన్: ఏ నోట విన్నా దోమలు బాబోయ్ అనే మాట తప్ప మరే మాట వినిపించని దుస్థితి నేడు నెలకొంది. ఓవక్క చలి తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా దోమల ఉధృతి మరింత పెరుగుతుండడం ప్రజానీకాన్ని కలవరపెడుతోంది. ఇళ్లలో సైతం నిల్చోనివ్వవు.. కూర్చోనివ్వవు.. పడుకోనివ్వవంటూ ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. ఇక ఆరుబయట ఉంటే శరీరంపై తేనెపట్టులా పట్టేసి జలగల్లా రక్తం పీల్చేస్తున్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా దోమకాటుతో ఏ రకాల జబ్బులు వస్తాయోనని ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. సాయంత్రం 5 గంటలైతే చాలు ఎక్కడలేని దోమలు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని ఏ మందులు వాడినా పోవడంలేదని వాపోతున్నారు.



తణుకు సూర్యదేవాలయంలో మురుగునీటితో నిండిన డ్రెయినేజీ



తణుకు బాబు వారి వీధిలోని డ్రెయినేజీలో దోమ లార్వాతో నిండిఉన్న దృశ్యం



తణుకు సజ్జాపురంలో దోమల బాధతో మంట వేసుకున్న నైట్ వాచ్‌మెన్‌లు

డ్రెయినేజీల్లో మురుగు సమస్య...

డ్రెయినేజీల్ల మురుగు సమస్యతోపాటు దోమల లార్వా కూడా అక్కడక్కడా దర్శనమిస్తుంది. ముఖ్యంగా డ్రెయినేజీల్లో మురుగునీరు ప్రవాహానికి చెత్త, వ్యర్థాలు తీవ్ర ఆటంకాన్ని సృష్టించడంతో సమస్య తీవ్రతరం అవుతుందని స్థానికులు చెబుతున్నారు. మురుగునీరు ప్రవాహం సక్రమంగా లేని డ్రెయినేజీల్లో లారా తీవ్ర స్థాయిలో తిష్టవేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 34 వార్డుల్లోను ఇదే సమస్య పొంచి ఉందని దోమకాటు నుంచి పిల్లలను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు చెప్పిన విధంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నా ఈ దుస్థితిలో మార్పు రావడంలేదని చెబుతున్నారు.

ఈగల సైజులో దోమలు..



ఈగల సైజులో ఉన్న దోమల తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. శరీరంపై వాలిందంటే కుట్టేసి రక్తం పీల్చేస్తున్నాయి. 5 గంటలు దాటితే చాలు బయటకు రాలేని పరిస్థితి తణుకులో నెలకొంది. తలుపులు బంధిస్తున్నా ఇళ్లలోకి కూడా ప్రవేశించి ఇబ్బందులు పెడుతున్నాయి. మునిసిపల్ అధికారులు దోమల నివారణకు అవసరమైన నిరోధక చర్యలు తీసుకుని దోమల బారి నుంచి ప్రజలను కాపాడాలి. దోమల దాటికి పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. వాతావరణం మారినా ఇంకా దోమల తీవ్రత పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

– షేక్ ఫహీమా, తణుకు

మలాథిన్ స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయిస్తున్నాం



దోమల నివారణకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నాం. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు డ్రెయినేజీల్లో లార్వా లేకుండా చర్యలు తీసుకున్నాం. 34 వార్డుల్లో ప్రత్యేక టీంల ద్వారా ఫాగింగ్ చేస్తున్నాం. గతంలో వాడుతున్న మలాథిన్‌కు దోమల నివారణ జరగడంలేదనే ఉద్దేశ్యంతో నాణ్యమైన కంపెనీలను గుర్తించి మలాథిన్ స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. ప్రస్తుతం 3 మిషన్ల ద్వారా ఫాగింగ్ చేస్తుండగా మరొక 3 మిషన్‌లు మరమ్మతుల కారణంగా గుంటూరుకు పంపించాం.

– టి.రామ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్, తణుకు

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ద్రోహం



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

ఇరగవరం: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ద్రోహం చేశారని సీపీఎం పార్టీ ఇరగవరం మండల కన్వీనర్ కామన మునుస్వామి పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 8వ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు కోతలు, సంపన్నులకు వరాలు కురిపించారని ఎద్దేవా చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలను దోచి కార్పొరేట్ శక్తులకు పంచి పెట్టే విధంగా ఉందని విమర్శించారు. విభజన చట్టప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థలకు కేటాయింపులు చేయలేదని, విశాఖ రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఊసే లేదని, వ్యవసాయ రంగానికి, ఆక్వా రంగానికి నిధులు కేటాయించలేదని ఏపీ రాష్ట్రానికి మొండి చేయి చూపారని విమర్శించారు. బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖమంత్రి పవన్ కల్యాణ్‌లు హర్షం వ్యక్తం చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు జుత్తిగా రామాంజనేయులు, గుబ్బల ముత్యాలు, పెచేటి సుబ్బారావు, పిల్లి కోటేశ్వరరావు, బొంత నాగబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రైవర్లు మంచి ఆరోగ్య అలవాట్లు కలిగి ఉండాలి



తణుకు ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న సోషల్‌వర్కర్ సాధు

తణుకు అర్బన్ : ఆర్టీసీ బస్సు డ్రైవింగ్‌కు ఏకాగ్రత ఎంత ముఖ్యమో మంచి ఆరోగ్య అలవాట్లను కలిగి ఉండడం కూడా అంతే ముఖ్యమని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎన్‌టీసీ సోషల్ వర్కర్ జి.సాధు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం తణుకు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచి ఆరోగ్యానికి అవసరమైన ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సరిపడా నిద్ర ఉండాలని సూచించారు. డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ అధ్యక్షతన ఈ సమావేశంలో సూపర్ వైజర్‌లు, డిపో, గారేజ్ సిబ్బంది, డ్రైవర్‌లు కండక్టర్‌లు పాల్గొన్నారు.

హలో మాదిగ చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి



హలో మాదిగ చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫిబ్రవరి 7వ తేదీన హైదరబాద్‌లో నిర్వహించే హలో మాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కె.రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజులు కోరారు. లక్షల డప్పులు, వేల గొంతులు కార్యక్రమం పోస్టర్‌ను యాగరపల్లిలో సోమవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి హైదరాబాద్ కార్యక్రమానికి మాదిగలు, ఉప కులాలు భారీగా తరలిరావాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నిబాబు, యజ్జల ప్రసాద్, దూలపల్లి ఆనంద్, బాబ్జి, ఏసోబు, పెనుమాకు యాకోబు, రాంబాబు, రమేష్, రామారావు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జడ్జి షేక్ సికిందర్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసిన కుసులూరి శివరామకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కసులూరి శివరామకృష్ణ సోమవారం అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి షేక్ సికిందర్ బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్జి సికిందర్ బాషా మాట్లాడుతూ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధితులు తరుపు వాదించి వారికి తగు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సీనియర్ న్యాయవాదులు తోట రాంబాబు, మాకా శ్రీనివాసరావు, ముప్పిడి సురేష్ రెడ్డి, కె.హరనాథ్, జి.ముఖర్జీ, ఎస్.విజయకృష్ణ, గోపి కృష్ణ, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, అడ్వకేట్ క్లర్క్స్, సిబ్బంది, పోలీసులు తదితరులు అభినందనలు తెలిపారు. అనంతరం శివరామకృష్ణ మాట్లాడుతూ తన వంతుగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి బాధితులకు న్యాయం చేస్తానన్నారు.

యల్లారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో యల్లారమ్మ తల్లి

తణుకు అర్బన్: తణుకు మండలం మండపాక గ్రామంలో యల్లారమ్మ తల్లి ఆలయంలో సోమవారం అమ్మవారికి సరస్వతీ అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించారు. భక్తులు, దాతల సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పుష్పోత్సవం జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు కొడమంచిలి బలరామకృష్ణమూర్తి, కొడమంచిలి నాగేశరాజగోపాల్, కొండవీటి అయ్యప్ప కృష్ణలు పూజాధికాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరి రామకృష్ణ, పెండ్యాల యిల్లపరాజు, ఆలపాటి శివరావు, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

చదువుల తల్లి సరస్వతికి పూజలు



అత్తిలి: బల్లిపాడులో సామూహిక అక్షరాభ్యస కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

అత్తిలి: జ్ఞాన సరస్వతి కరుణా వీక్షణలు విద్యార్థుల మీద ప్రసరించి, జ్ఞాన సంవృద్ధులై విభిన్న రంగాల్లో రాణించాలని స్కూల్ డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్ అన్నారు. సోమవారం అత్తిలి మండలం బల్లిపాడు శ్రీమదనగోపాల్ స్కూల్‌లో శ్రీపంచమి వేడుకలు వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరైన పలువురు చిన్నారులచే విద్యారంభం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ గీతా భారతి, ప్రధానోపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ ఆకుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో వసంత పంచమి వేడుకలు



తణుకులో వసంత పంచమి వేడుకలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసుందరీబాయ్

తణుకు అర్బన్: స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ ఆధ్వర్యంలో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్ఞానం, విద్య, కళలు, సంగీతాలకు ప్రతీక సరస్వతీదేవి అన్నారు. వసంత పంచమి రోజును వసంత రుతువుకు స్వాగతం పలుకుతూ పిల్లల అక్షరాభ్యాసానికి శుభదినంగా పరిగణిస్తారని చెప్పారు. విద్యార్థులు విద్యలో రాణించి భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొంది ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి.శివప్రసాద్, డాక్టర్ జి.అమృతవల్లి, కేవీ శ్యామలాదేవి, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి



నెల్లిమర్ల అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయకార్యదర్శి మామిడి దానవర ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కోతి బొమ్మ సెంటర్‌లో నెల్లిమర్ల జూట్ కార్మికుల అమర వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మామిడి దానవర ప్రసాద్ మాట్లాడుతూ నెల్లిమర్ల అమరవీరుల అమరత్వం చెంది 31 సంవత్సరాలు అవుతుందని చెప్పారు. 1994లో జనవరి 29న రైలు పట్టాలపై పాలకవర్గాల ధమనకాండకు 5 గురు కార్మిక యోధులు అసువులు బాసి అమరులయ్యారన్నారు. కార్మికులు తూటాల దెబ్బలకు గురికాగా వందలాది మంది క్షతగాత్రులయ్యారన్నారు. అనేక దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరోచిత పోరాటాల స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, డి.రాము, చంద్రశేఖర్, రామ్‌మోహన్, ఆదినారాయణ, శ్రీనివాస్, వాసు, నాని, చలపతి తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో బలుసులమ్మ తల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వివిధ ఆలయాల్లో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ ఇలవెల్పు బలుసులమ్మ ఆలయంలోని అమ్మవారిని సరస్వతిదేవిగా విశేష అలంకరణ గావించారు. పలు ఆలయాల్లో చిన్నారులకు సరస్వతి మాత అనుగ్రహ పూజలు జరిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

డీఆర్ గోయంకా విద్యాసంస్థలో వసంత పంచమి వేడుకలు

స్థానిక డీఆర్ గోయెంకా విద్యా సంస్థలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారం చేశారు. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ముత్తా రామారావు, వాసవి కళాశాల అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ గణపతిరామ్, పాఠశాల ప్రిన్సిపాల్ డి.జయలక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన మందేశ్వరస్వామి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు



మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

పెంటపాడు: మండలంలోని వల్లూరుపల్లి గ్రామంలో మందేశ్వరస్వామి పునఃప్రతిష్ఠ పూజలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి సమేత విశ్వేశ్వర, బాలా త్రిపురసుందరి సమేత మందేశ్వర, సుబ్రహ్మణ్య స్వామివార్ల ఆలయ, విగ్రహప్రతిష్టతో పాటు, ధ్వజస్తంబ ప్రతిష్ఠారాధనను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వేదుల వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో పరిమెళ్లకు చెందిన వేదపండితులు బాదంపూడి ఫణిశర్మ ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీమంత్రి కొట్టు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ముగింపు సందర్భంగా జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చీమలకొండ సాయి, గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడెంలో సంస్కృత భారతీ శిక్షణ కేంద్రం ప్రారంభం



పరీక్ష పేపర్లను విడుదల చేస్తున్న వేమూరి రామమ్, గరికిపాటి బాపయ్య శర్మ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంస్కృతి భారతీ ఆంధ్ర ప్రదేశ్ (విజయవాడ) శాఖ నిర్వహణలో తాడేపల్లిగూడెంలో మొదటి సారిగా సరలా సంస్కృత పరీక్షలు సోమవారం స్థానిక రామచంద్రరావుపేటలో నిర్వహించారు. కొలచన మహతి నిర్వహణలో స్థానిక మహతీ సంస్కృత శిక్షణ కేంద్రం ఆవరణలో నిర్వహించిన ఈ పరీక్షను శంకరమఠం నిర్వాహకులు వేమూరి రామమ్, గరికిపాటి బాపయ్య శర్మలు పర్యవేక్షకులుగా హాజరై ప్రారంభించారు. సంస్కృతంలో శిక్షణ పొందిన 16 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పరీక్షలను రాశారు. డాక్టర్ కొలచన సూర్యనారాయణమూర్తి, కృష్ణ ప్రసాద్‌లు పాల్గొన్నారు. సరలా నుంచి సుగమం సంస్కృతిక సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సమన్వయకర్త, నిర్వాహకురాలు కొలచన మహతి తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం

భీమవరం: ప్లాస్టిక్ వినియోగించడం వలన క్యాన్సర్ వ్యాధి ప్రభలుతుందని అందువల్ల ప్లాస్టిక్ నిషేధాన్ని బాధ్యతగా తీసకోవాలని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు అన్నారు. సోమవారం భీమవరం మున్సిపాలిటీ, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విచ్చల విడిగా ప్లాస్టిక్ వాడడం వలన వాతావరణం కలుషితమై కొన్ని రకాల వ్యాధులకు కారణమవుతుందని ప్లాస్టిక్ వలన ఏర్పడే అనర్థాలను ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మనుషులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం కూడా ఆరోగ్యకరంగా ఉంటుందని ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టి ఆరోగ్యకరమైన సమాజాన్ని సృష్టించాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు స్టీల్ గ్లాసులు, ప్లేట్లు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు వేంద్ర వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, చెల్లబోయిన రంగారావు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ హరహరనాథ్

పెంటపాడు: మండలంలో గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆ శాఖ పీడీ హరహరనాథ్ పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఇళ్లు వాటి ప్రగతిపై సమీక్షించారు. మండలంలో త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకట్రావు, ఎంపీడీవో బాలాజీ, వర్క్ ఇన్‌స్పెక్టర జయరాజు, ప్రసాద్, గ్రామాల ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ స్థలం ప్రభుత్వానిదే

- ఇది కచ్చితం
- లేఖర్ల స్థలంపై రెవెన్యూ రికార్డులు

తాడేపల్లిగూడెం: పట్టణంలో ప్రధాన రహదారి కోడేరు నల్లజర్ల రోడ్డుకు ఆనుకొని ఉన్న తాలూకా ఆఫీస్ ప్రాంగణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలం మాదేనంటూ ఇటీవల కొందరు నానా హంగామా సృష్టించారు. భవనాలు నిర్మిస్తామంటూ హడావిడి చేశారు. దస్తావేజు లేఖర్ల ఆధీనంలో అనాధికారిక అడ్డాగా ఈ ప్రాంతం మారింది. దళారుల ప్రోత్సాహంతో రాత్రికి రాత్రే పాకలు ఉన్న ఈ ప్రాంతంలో పక్కా భవనాలు నిర్మిద్దామనే ప్రయత్నాలు జరిగాయి. మీడియా చొరవతో ఆ ఆక్రమణలకు అడ్డుకట్ట పడింది. రెవెన్యూ ఉన్నతాధికారుల చొరవతో మళ్లీ పనులు ముందుకు సాగలేదు. కాని ఈ స్థలం ఎవ్వరిది అనే విషయంలో ఇతమిద్ధంగా ఎవ్వరి దగ్గర సమాచారం లేదు. దీంతో ఎవ్వరికి అనుకూలంగా వారు ఈ స్థలం మాదే. ఈవీఎస్ టైంలో మాకిచ్చారు. కోర్టులో మాకు అనుకూలంగా తీర్పులు ఉన్నాయనే స్పష్టతలేని వాదనలు చేశారు. దీనిపై సమాచార హక్కుచట్టం ద్వారా సాక్షి సమాచారం సేకరించింది. ఇది ప్రభుత్వ స్థలమే ఇది కచ్చితం అంటూ రెవెన్యూ అధికారులు సమగ్ర సమాచారం అందజేశారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు ఆక్రమించుకున్న స్థలం

కార్యాలయాలు ప్రభుత్వ స్థలంలోనే..

ఆర్అండ్‌బీ బంగ్లా దగ్గర నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు ఉన్న సుమారు నాలుగు ఎకరాలపై చిలుకు భూమి అంతా రెవెన్యూ రికార్డుల్లో తాలూకా కాంపౌండ్‌గా ఉంది.

ఆర్అండ్‌బి బంగ్లా, ఆర్‌డీఓ కార్యాలయం – సర్వే నంబర్లు 56–1,3.60 ఎకరాలు

కోర్టు బిల్డింగ్ – సర్వే నంబర్లు 56–7,67 సెంట్లు, సర్వే నంబరు 56–1, 32 సెంట్లు ,56–1, 26 సెంట్లు, ఫైర్ స్టేషన్ –సర్వే నంబరు –56–1,32 సెంట్లు, సబ్ జైలు – సర్వే నంబరు –56–1,59 సెంట్లు, ఖజానా కార్యాలయం –సర్వే నంబరు –56–1,09 సెంట్లు, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ – సర్వే నంబరు –56–1,11 సెంట్లు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ – సర్వే నంబరు 56–1,12 సెంట్లు, పాత ఎంఆర్‌ఓ కార్యాలయం – సర్వే నంబరు –56–1,11 సెంట్లు, ఖాళీ స్థలం – సర్వే నంబరు –56–1,03 సెంట్లు, దస్తావేజు లేఖర్లు ఉంటున్న స్థలం – సర్వే నంబరు 56–1, 34 సెంట్లు, మీ సేవ బిల్డింగ్ – సర్వేనంబరు 56–1, 02 సెంట్లు , అన్న క్యాంటీన్ – సర్వే నంబరు –56–1,06 సెంట్లు, సబ్ జైల్ బిల్డింగ్ టు –సర్వేనంబరు 56–1,06 సెంట్లు, సీఎస్.ఎంఆర్‌ఓ ఆఫీస్ ఓపెన్ ఏరియా– సర్వే నంబరు 56–1, 8.3 సెంట్లు, పెన్షనర్ల బిల్డింగ్ – సర్వే నంబరు 56–1, 04 సెంట్లు, హౌసింగ్ బిల్డింగ్ –సర్వే నంబరు –56–1, 06 సెంట్లు, రోడ్ – సర్వే నంబరు –56–1, 32 సెంట్లు, ప్రస్తుత ఎంఆర్‌ఓ కార్యాలయం – సర్వే నంబరు 56–1, 11 సెంట్లు , వెలుగు బిల్డింగ్ – సర్వే నంబరు –56–1,11 సెంట్లు, ఖాళీస్థలం – సర్వే నంబరు 56–5, 01 సెంటు, పోలీస్ స్టేషన్ సర్వే నంబర్లు 56–1, 56–5, 22 సెంట్లు, రైతు బజార్ షెడ్ – సర్వే నంబరు –56–1, 20 సెంట్లు, ఎంపీడీఓ కార్యాలయం – సర్వే నంబరు 56–1, 17 సెంట్లు . ఇవి కాకుండా ఉన్న మిగిలిన భవనాలు రికార్డులు అందాల్సి ఉంది. ఇది ప్రభుత్వ భూమి ఇది కచ్చితమైన లెక్కలని రికార్డులు చెబుతున్నాయి.